**కథ**

# ఆ గంటున్నర సేపూ...

నందిరాజు పద్మలతా జయరాం

**ఖాళీగా వుంది పదో నంబర్ ప్లాట్‌ఫారం.**

**పట్టాల మీద ఓ ఇంజన్ మాత్రం కునుకు తీస్తోంది. పాలిష్డ్ బండల చప్టాలు అందంగా మెరుస్తున్నాయి. సామాను వాటి మీదే సర్దుకుని, అక్కడే పడుకున్నారు కొందరు ముష్టివాళ్ళు. ప్రయాణికుల హడావుడి అస్సలు లేదు.**

మధ్యాహ్నం పన్నెండూ నలభై అవుతోంది. ఒంటిగంటకి వచ్చే శబరీ ఎక్స్‌ప్రెస్‌లో దిగబోతున్న కొడుకుని రిసీవ్ చేసుకోవడానికి స్టేషన్‌కి వచ్చింది సుధ.

''ఇదిగో బాబూ! శబరీ ఎక్స్‌ప్రెస్ వచ్చేది ఈ ప్లాట్‌ఫాం పైకే కదూ!'' ఎర్రచొక్కా కూలీని అడిగింది అనుమాన నివృత్తి కోసం.

''అవును. త్రివేండ్రం ఎక్స్‌ప్రెస్సే గదా! ఈ ప్లాట్‌ఫాం మీదికే వస్తుంది'' చెప్పాడు మెట్లెక్కుతూ.

''లేటేం లేదు కదా!'' మళ్ళీ అడిగింది సుధ.

''రెండు లోపల వస్తది'' మన రైళ్ళు లేట్ లేకుండా వుంటాయా అన్నట్లు నవ్వి వెళ్ళిపోయాడు రైల్వే కూలీ.

నిదానంగా మెట్లు దిగి నడుచుకుంటూ రాసాగింది సుధ.

''యా ఊరు పోవాల?''

ప్రశ్న విని తల ఎత్తి చూసింది.

ముగ్గుబుట్టలాంటి తల, బోసి నోరు. ఎనభై ఏళ్ళకి తక్కువ కాని వయసున్న ముసలమ్మ అడుగుతోంది. ప్లాస్టిక్ గ్లాసులోని నీళ్ళల్లో ఎండిపోయిన బన్ను ముక్కని నానపెట్టుకుని తింటోంది. కట్టుకున్న చీరతోపాటు నలిగిపోయి ముడతలు పడ్డ చర్మాన్ని ఆచ్ఛాదనగా చేసుకున్న బొమికలు. ప్రాణం వుందన్నందుకు గుర్తుగా పగిలిపోయిన గాజుముక్కల్లా కళ్ళు..ఆ కనుపాపల్లో శుక్లం తాలూకు తెల్లటి మచ్చలు.

గుండె పిండినట్లయింది సుధకి.

''ఎక్కడికీ లేదమ్మా'' చెప్పి, ఓ అడుగు ముందుకేసింది.

''ఓ రూపాయియ్యమ్మా! నీ పేరు చెప్పుకుని ఛాయ్ తాగుతా'' చెయ్యి జాపింది ముసలామె.

పర్సులో నుంచీ రెండు రూపాయల బిళ్ళ తీసి వేసి, ముందుకు నడిచింది సుధ.

ఇంకా పది నిమిషాలు తక్కువ ఒంటి గంట మాత్రమే. అరుగు మీద ఆనుకుని కూర్చుంది.

'ప్చ్! ఎవరో కదా ఈ ముసలామె. పాపం! జీవితం చివరి దశలోకి వచ్చినా తన పొట్ట తానే నింపుకోవాల్సి వస్తోంది. ఎంతమంది పిల్లలో! అసలున్నారో? లేదో? వుండీ పట్టించుకోవట్లేదేమో! రేపు ఏ రోగమో రొష్టో వస్తే, ఆ కాస్త ప్రాణం గుటుక్కుమంటే మున్సిపాలిటీ వాళ్ళు తీసుకెళ్ళాల్సిందే కదా!' ఆలోచిస్తోంది సుధ.

'పోనీ! ఎన్నో అనాథాశ్రమాలున్నాయ్ కదా! తీసుకెళ్ళి చేర్పిస్తేనో! అవును. అదే సరైన పని. మానవత్వం వున్నవాళ్ళు చెయ్యాల్సిన పని అదే!' గట్టిగా తీర్మానించుకుంది.

''దయచేసి వినండి. హైదరాబాద్ నుంచీ గుంటూరు వెళ్ళే పలనాడు ఎక్స్‌ప్రెస్, ప్లాట్‌ఫారం ఎనిమిది పైన ఆగి వున్నది'' రైల్వే అనౌన్స్‌మెంట్ మూడు భాషల్లోనూ వినిపించింది.

సుధ ఆలోచనలు మారాయి.

పక్కనుండి వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకుంటూ వెళ్తున్నారు.

'బోగీ నంబర్ పదమూడు కదూ! బాగా ముందుకి ఆగుతుంది'

తన కొడుకు వచ్చేది పదమూడో నంబర్ బోగీలోనే. గబుక్కున లేచి, ముందుకి నడిచింది సుధ.

''శబరి కొరకామ్మా! ఇంక గంట పడతాది'' అడక్కుండానే చెప్పాడు ఓ రైల్వేకూలీ. పదిమంది దాకా గుంపుగా కూచుని సిగరెట్లు కాలుస్తూ కబుర్లు చెప్పుకుంటున్నారు వాళ్ళు.

మరింత ముందుకు నడిచివెళ్ళి అరుగుమీద కూర్చుంది.

''యశ్వంత్‌పూర్ వెళ్ళవలసిన పెన్‌గంగ ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫారం నెంబర్ ఏడుపైకి కొద్ది నిమిషములలో వచ్చుచున్నది'' మళ్ళీ మూడు భాషలలోనూ అనౌన్స్‌మెంట్.

'ప్చ్! ఏదో ఓ పుస్తకం కొని తెచ్చుకుంటే బాగుండేది. ఇప్పుడు కొనాలంటే మళ్ళీ మెట్లెక్కి పక్క ప్లాట్‌ఫారం మీదికి వెళ్ళాలి. ఇక్కడెందుకో పుస్తకాలు, బిస్కట్లు, డ్రింకులూ ఏవీ అమ్మడం లేదు' నిరాశగా అనుకుని పొడుగ్గా వున్న ప్లాట్‌ఫారం మీద అడుగులో అడుగేసుకుంటూ నడుస్తోంది సుధ.

ప్లాట్‌ఫారం గోడవైపు ఆనుకుని, అటు తిరిగి రొట్టెలు కాలుస్తోంది, రాజస్థానీ యువతి. ఆమె చుట్టూ నలుగురు పిల్లలు. మాసిపోయిన ఎర్రటి చర్మం, దానితో పోటీ పడుతూ ఎర్రటి రేగిపోయిన జుత్తు. ఆవురావురుమంటూ తింటున్నారు జొన్న రొట్టెలో మిరపకారం నంచుకుంటూ. బోర్లించిన ఇనుప రేకుమీద, క్షణాల్లో జొన్నపిండి ముద్దని విశాలమైన రొట్టెగా తడుతూ కాలుస్తున్న ఆ యువతిని కాసేపు చూసింది సుధ. రాష్ట్రం కాని రాష్ట్రం, భాష రాదు, తిండి తిప్పలు వేరు. అయినా ఏ ధైర్యంతో వస్తారో వీళ్ళు పిల్లాజెల్లాతో సహా. ఉండటానికి గూడూ, కట్టే బట్టా కూడా లేకుండా ఎలా బ్రతకగలరో! అసలు జీవితం పట్ల భయం వుండదేమో! ఎక్కడనుండీ వస్తుందబ్బా ఆ భరోసా! ఎలా బ్రతకగలమాని దిగులే కన్పించదేం ఆ ముఖాల్లో. ఆశ్చర్యంగా అనుకుంటూనే ముందుకు నడిచి, మరో అరుగుమీద కూర్చుంది.

ఇంకా ఒకటిన్నర కూడా కాలేదు. కొద్దిగా జనం చేరారు ప్లాట్‌ఫారం మీద. అవతలి ప్లాట్‌ఫారం పైనుండి దిగి పట్టాలకి అడ్డం పడి ఇటు వచ్చాడో పదేళ్ళ కుర్రవాడు.

''అమ్మగారూ! ఒక్క పద్యం పాడేదా!''

''నువ్వా! పాడతావా!'' నవ్వింది సుధ. వాడి ఒంటిమీద పాదాలని అంటుతూన్న చొక్కా. ఒక్కో పాదానికీ ఒక్కో రకం చెప్పు వేసుకున్నాడు. బ్యాగ్‌లోంచీ ఓ రూపాయి తీసి వేసింది.

''నిజంగా పాడతానమ్మా..ఇనండి'' గొంతెత్తాడు వాడు.

''జెండాపై కపిరాజు...'' కంచుకంఠం మ్రోగింది.


''అల వైకుంఠపురిలో, ఆ మూల సౌధమ్ములో'' అదే స్థిరత్వం గొంతులో.

''బాగుంది..ఎక్కడ నేర్చావు?'' అడిగింది సుధ.

''మా నాన్న హరికథలు చెప్పేవాడండి. ఇంకోటి ఎత్తుకోనాండీ'' సుధ సమాధానం కోసం ఎదురు చూడకుండానే-

''మందార మకరంద మాధుర్యముల తేలు మధుపంబు..'' ఆ పద్యం పూర్తికాకముందే మరో భాగవత పద్యం.

ఆశ్చర్యపోయింది సుధ. వాడి గళంలో అలవోకగా పలుకుతున్న భావ, రాగ ప్రౌఢిమ అద్భుతంగా వుంది.



''వస్తా నమ్మా'' దండం పెట్టి వెళ్ళిపోయాడు, మరో చోట తన విద్య ప్రదర్శించడానికి.

'ఇలాంటి వాళ్ళని ప్రోత్సహిస్తే, ఎంత మంచి కళాకారులుగానో తయారవుతారు. ఇవాళా, రేపు అక్షరం పలకడం రాకుండా, ముఖంలో మచ్చుకి కూడా భావ ప్రకటన లేకుండా కూడా నటీనటులై కూర్చుంటున్నారు. టీవీల్లో, సినిమాల్లో నటించేస్తున్నారు. వీళ్ళేమో, పాపం, తిండి లేక అడుక్కు తింటున్నారు. కనీసం నా లాంటి వాళ్ళయినా వీళ్ళను ఎంకరేజ్ చేస్తే ఎంత బాగుంటుంది. వీరి విద్యను కాస్త సానబట్టి, ఒక పద్ధతి ప్రకారం వీళ్ళను నడిపిస్తే మంచి కళాకారుల్ని రాష్ట్రానికి అందించిన వాళ్ళం అవుతాం. వెళ్ళేటప్పుడు ఈ పిల్లవాడి వివరాలు తెలుసుకుని వెళ్ళాలి' గట్టిగా అనుకుంది సుధ.

''హైదరాబాద్ నుండీ బయల్దేరే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ కొద్ది నిముషములలో ప్లాట్‌ఫారం నంబరు మూడు మీది నుండి బయలుదేరుటకు సిద్ధముగా వున్నది'' త్రిభాషా సూత్రం పాటించింది రైల్వే అనౌన్సర్ మళ్ళీ.

ఒకటీ నలభై దాటింది. నెమ్మదిగా నిండుతోంది ఏదో నంబర్ ప్లాట్‌ఫారం తమ వాళ్ళని రిసీవ్ చేసుకోవడానికి వచ్చిన వాళ్ళతో. బొజ్జ నిమురుకుంటూ నడుస్తున్న శేఠ్‌గారి పక్కన సూట్‌కేసుని, ఎయిర్ బ్యాగ్‌ని మోసుకుంటూ నడుస్తున్నాడు బక్క బంట్రోతు. అందరూ తనని గమనిస్తారో లేదో అని వెనక్కి తిరిగి, తిరిగి చూసుకుంటూ నడుస్తున్న పొట్టి చొక్కా, టైటు ప్యాంటూ, బాబ్డ్‌హెయిర్ అమ్మాయి. కూలింగ్ గ్లాసులు సవరించుకుంటూ, దొంగచూపులు చూస్తున్న యాభై దాటిన రసిక చక్రవర్తి...

'ఏమిటో ఈ లోకం? ప్రతి ఒక్కరూ ఇది తమకే సొంతం అనుకుంటారు' నవ్వుకుంది సుధ.

''అమ్మా మాజా కావాలా'' అడిగాడు వెండర్.

అడ్డంగా తల ఊపింది. అతను వెళ్ళీ వెళ్ళగానే పుస్తకాల బండి.

''మాగజైన్స్ చూస్తారా మేడమ్''

''ఊహు'' అంది సుధ. గంటనుండీ బోర్ కొడుతూంటే ఎవ్వరూ రాలేదు. ఇప్పుడు రైలొచ్చే టైంకి అందరూ రెక్కలు కట్టుకుని ఎగిరొచ్చారు అనుకుంది సుధ.

''దయచేసి వినండి. తిరువనంతపురం నుండీ వచ్చుచున్న త్రివేండ్రం ఎక్స్‌ప్రెస్, మరికొన్ని నిముషములలో ప్లాట్‌ఫారం పది పైకి వచ్చుచున్నది.''

ఆ అనౌన్స్‌మెంట్ వినగానే తక్కున లేచి నిల్చుని ప్లాట్‌ఫారం అంచు దగ్గరగా వెళ్ళింది సుధ.

ఏడో తరగతి చదువుతున్న భరత్ స్కూల్ తరపున విహారయాత్రకి వెళ్ళాడు. వాడికోసం కళ్ళు కాయలు కాసేలా ఎదురుచూస్తోంది సుధ.

రెండుంబావుకి రైలు వచ్చి ఆగగానే, పదమూడో నంబర్ బోగీ దగ్గరికి పరుగెత్తింది సుధ. భుజాన ఎయిర్ బాగ్, చేతిలో వాటర్ క్యాన్‌తో దిగిన కొడుకుని చూడగానే ఆర్తిగా వాణ్ణి హత్తుకుని వల వలా ఏడ్చేసింది.

అమ్మ ఎందుకు ఏడుస్తుందో వాడికి అర్థం కాలేదు.

''నీకన్నా, మీ అమ్మ ఎక్కువ దిగులు పడినట్లున్నారే!'' ఒక టీచర్ కామెంట్ చేసింది.

సిగ్గుగా కళ్ళొత్తుకుంది సుధ.

''కన్నా! నాన్నగారికి ఆఫీస్‌లో పర్మిషన్ దొరకలేదు. అందుకే రాలేదు. ఎలా వున్నావు నాన్నా? అసలు అన్నం తిన్నావా? లేదా? అలా చిక్కిపోయావు. వాళ్ళు సరిగ్గా చూసుకోలేదా!'' ప్రశ్నలడుగుతూనే ప్లాట్‌ఫారం దాటి రోడ్‌మీదికి వచ్చేసింది.

ఇందాక తాను తీసుకున్న నిర్ణయాల్లో ఒక్కటి కూడా ఆమెకు గుర్తుకు రాలేదు. స్టేషన్లో ముసలమ్మా, వలస వచ్చిన కుటుంబమూ, పద్యాలు పాడిన కుర్రవాడూ.. అందరూ ఆమెకు మిగిలిన గంటన్నర కోసం, కాలక్షేపానికి పనికి వచ్చారు.

మరేం ఫర్వాలేదు. మళ్ళీ రైల్వే స్టేషన్లో ఆమె ఎదురుచూడక పోదు. ఇలాంటివాళ్ళు తటస్థ పడకుండానూ పోరు. సగటు భారతీయుడి స్పందన, ఆలోచన ఆశయం వరకే, ఆచరణ వారికి అంటదు.